# సత్యవాక్యము

## క్రైస్తవ మాసపత్రిక




February 1994

# THE WORD OF TRUTH

# సంక్షిప్త వార్తలు

కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ నిర్వహించిన 8వ బైబిల్ సెమినార్ జనవరి 17వ తేదీ నుండి 21 వరకు విద్యుత్ నగర్‌లో స్కూలు భవనము నిర్మించబోయే విశాల మైదానంలో వేయబడిన అతి పెద్ద టెంట్ ఆడిటోరియంలో ఘనంగా జరిగెను. దేశంలో పలు రాష్ట్రాల నుండి వచ్చిన సువార్తికులు పెద్ద సంఖ్యలో హాజరై క్షేమాభివృద్ధి నొందిరి.

బ్రదర్ జాన్ ఫోర్డుగారు మరియు స్వదేశీ సోదరులు దేవుని వాక్యమును సరళమైన భాషలో బోధించి అనేక హృదయాలలో ఆదరణ కలిగించుటయే గాక ఆనందముతో నింపిరి. ప్రశాంత వాతావరణంలో సెమినార్ జరిగెను. సహవాసమందలి మాధుర్యము, దేవుని వాక్యము యొక్క ఔన్నత్యము, ఐక్యతలోని ఆనందము మరియు క్రైస్తవ ప్రేమ యొక్క శక్తి ఎట్టిదో గ్రహించిరి. బ్రదర్ ఫోర్డుగారు అపొస్తలుల కార్యముల గ్రంథమందలి 28 అధ్యాయముల లోను వ్రాయబడిన ప్రతి వచనమును చక్కగా విశదీకరించి, అనేక నూతన తలంపులను వాక్యమునుండి అందించగలిగిరి. సంఘము స్థాపింపబడిన తరువాత జరిగిన 35 సంవత్సరముల సంఘ చరిత్రను విపులంగా బోధించుచుండగా వచ్చిన వారందరు మంచి తర్ఫీదు పొందిరి. ఆయన అందించిన అనేక మంచి పాఠాలలో ఒక మచ్చు తునకను మీ ముందుంచుటకు ఆనందించుచున్నాము.

ఫిలిప్పు సమరయలో దేవుని వాక్యము ప్రకటించుచుండెను. అక్కడ ఉన్నవారు పరిశుద్ధాత్మను పొందునట్లు పేతురును, యోహానును పంపబడిరి (అ.కా. 8:14-16). ఫిలిప్పు చేతులుంచబడుట ద్వారా పరిశుద్ధాత్మను పొంది సూచకక్రియలు చేయుచున్నను (అ.కా. 6:6) సమరయవారు పరిశుద్ధాత్మను పొందునట్లు పేతురును, యోహానును

(తరువాయి టైటిలు 3వ పేజీలో)

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor :
J.C. CHOATE

Managing Editor :
JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 14 ఫిబ్రవరి 1994 సంచిక 7

## సంపాదకీయము

### క్రైస్తవుడెవరు?

### (Who is a Christian?)

ఈ ప్రపంచములో చాలమంది క్రైస్తవులమని చెప్పుకొనేవారున్నారు. క్రైస్తవుడను పదమునకు చాల నిర్వచనములుకూడ గలవు. క్రైస్తవుడను పేరునకు గల భావమును గూర్చి, క్రైస్తవునిగూర్చి మనము కొంత తెలిసికొందము. మనము తెలిసికొనిన విషయములను బట్టి ఆశ్చర్యము కలగవచ్చు.

"క్రైస్తవుడని" పిలువబడినంత మాత్రముననే ఒక వ్యక్తి క్రైస్తవుడు కాడు. అతడు దేవుని నమ్మవచ్చు, ప్రభువైన యేసు దేవుని కుమారుడని ఒప్పుకొనవచ్చు. అయినను అతడు క్రైస్తవుడు కాడు. అతడు బాప్తిస్మము పొంది యేదైనా ఒక సంఘమందు సభ్యత్వము కలిగి యుండవచ్చు, అయినను అతడు క్రైస్తవుడు కాడు.

అతడు చాల భక్తికలిగి యుండవచ్చు, దాతృత్వము గల వ్యక్తి కావచ్చు, ఎన్నో మంచి కార్యములు చేయు వ్యక్తి అయియుండ వచ్చు, ఒక బోధకునిగ యుండవచ్చు అయినప్పటికిని ఆ వ్యక్తి ప్రభువుకు సంబంధించిన వ్యక్తిగ, క్రైస్తవునిగ పరిగణింపబడడు. అతడు తరచుగా ప్రార్థన చేయుచూ యుండవచ్చు. ప్రతి ఆదివారమున ఆరాధనకు వెళ్ళుచూ యుండవచ్చు. శరీరసంబంధమైన క్రియలను విసర్జించినవాడై యుండవచ్చు, జాగ్రత్తగా ఆలోచించి మాట్లాడే వ్యక్తి కావచ్చు, చాలమంచి పేరు సంపాదించుకొని యుండవచ్చు అయినను అవన్నిటినిబట్టి కూడ అతడు దేవుని బిడ్డగ, క్రైస్తవునిగ యుండ లేడు.

ఇటువంటి వ్యాఖ్యలు మీరు వినుటద్వారా మీకు ఆశ్చర్యము కలుగవచ్చు: నేను చాలమందిని ఖండించుచున్నానని లేక వ్యాఖ్యానించుచున్నానని, లేక మీకు తెలిసినవారిలో కొందరిని గూర్చి యిట్లు చెప్పుచున్నానని లేక మిమ్మును గూర్చియే యిట్లు వ్రాయుచున్నానని మీరు తలంచవచ్చు. ఒక వ్యక్తి పై విషయము లన్నియు నిర్వర్తించుట చూచిన వారెవరైననూ అతని క్రియల ద్వారా చాల మంచి క్రైస్తవుడని చెప్పుదురు. ఇచ్చట మీరుగాని లేక చాలమందిగాని ఒక విషయమును గమనించుటలేదు. అదేమనగా అటువంటి వ్యక్తి మోసగింపబడుచున్నాడు. పైన వివరించిన విషయము లన్నియు అతడు పూర్తిగ నెరవేర్చుచు యుండినప్పటికిని అతడు అబద్ధ బోధలకును, నటనలకును ఆధారమై యుండినయెడల అతడు క్రైస్తవునిగ యుండ లేడు. మనము మోసపోకుండ జాగ్రత్తపడునట్లు వాక్యము పదేపదే హెచ్చరించుచున్నది. "అట్టివారు క్రీస్తుయొక్క అపొస్తలుల వేషము ధరించుకొనువారై యుండి, దొంగ అపొస్తలులును మోసగాండ్రగు పనివారునై యున్నారు. ఇది ఆశ్చర్యముకాదు; సాతాను

తానే వెలుగు దూత వేషము ధరించుకొనుచున్నాడు. కనుక వాని పరిచారకులును నీతి పరిచారకుల వేషము ధరించుకొనుట గొప్ప సంగతి కాదు. వారి క్రియల చొప్పున వారి కంతము కలుగును" (II కొరింధి 11 : 13-15).

కనుక క్రైస్తవుడెవరు? ఇట్టి ప్రశ్న ఏదైన యుండిన యెడల మనము వాక్యముద్వారా తెలిసికొనవలెను. జవాబుకొరకు వేరొక చోటకు మనము వెళ్ళినట్లయిన సమయము వ్యర్థాయగుట మాత్రమే గాక మనకు సరియైన జవాబు దొరకదు. దేవుని వాక్యానుసారముగ క్రైస్తవుడు దేవుని చిత్తమును ఎరిగినవాడై యుండి, ఆయన యందు నమ్మిక యుంచి, యేసు దేవుని కుమారుడని విశ్వసించువాడు (రోమా 10:17; హెబ్రీ 11:6; యోహాను 14 : 1-2). క్రైస్తవుడు తన పాపముల విషయమై మారుమనస్సు నొంది క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొనినవాడు (అ.కా. 17:30; లూకా 13:3; మత్తయి 10:32-33). క్రైస్తవుడు కాగోరువాడు (నీటియందు ముంచబడుటద్వారా) పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెను (అ.కా. 2 : 38). అతడు క్రీస్తు నామము ధరించిన క్రీస్తు సంఘములో క్రీస్తుచే సభ్యునిగా చేర్చబడినవాడు (మత్తయి 16 : 18; అ.కా. 4 : 12; రోమా 16:16). క్రైస్తవుడు ఆత్మతోను, సత్యముతోను ప్రతి ఆదివారమున దేవుని ఆరాధించువాడు (యోహాను 4:24, అ.కా. 20:7). క్రైస్తవుడు యిహలోక సంబంధమైన దురాశలను విసర్జించి స్వస్థబుదితోను, నీతితోను, భక్తితోను జీవించుచు, యితరలకు మేలుచేయుచు, దేవుని యెడల విశ్వాసత కలిగియుండు నట్టివాడు (1 యోహాను 2 : 15-17; తీతు 2 : 11-12; ప్రకటన 2:10). ఈ విషయము లన్నిటిని గూర్చి మనము మాట్లాడుకొనినను అవి బాహ్యమైనవే గాని దేవుడు హృదయములను చూచును. మనకు న్యాయపు తీర్పు, అదే తుది తీర్పు

తీర్చే వాడు ఆయన మాత్రమే. ఈ చెప్పబడిన విధముగ యే వ్యక్తి దేవునికి విధేయుడై, తన్ను తాను దేవునికి సమర్పించుకొనునో అట్టి వ్యక్తికి తన ప్రవర్తనద్వారా, క్రియలద్వారా నిజమైన క్రైస్తవునిగ, క్రీస్తును వెంబడించే వ్యక్తిగా సాక్ష్యము కలుగును.

ఇపుడు మీ విషయమై మీరు యేమి ఆలోచించుచున్నారు? ఈ చెప్పబడిన అన్ని విషయముల ద్వారా మీరే స్థితిలో యున్నట్లు మీరు తలంచుచున్నారు ? మీరు దేవునియందు విధేయత కలిగియున్నారా? ఆయన సంఘమందు మీరు సభ్యులుగా యుంటిరా? దిన దినము మీరు ఆయన కొరకు జీవించుచున్నారా ? అట్లు కానిచో మీరు దేవునికి విధేయులై మీరు యేమై యుండవలెనని ఆయన మిమ్మును గూర్చి కోరుచున్నాడో అట్లుండు టకుమీ కొరకు ప్రార్థన చేయుదుము. మీ అంతరంగ స్వభావమునుబట్టి, మీ జీవితముద్వారాను మీరు క్రైస్తవునిగ ఈ లోకమునకు తెలియజేయండి. మీ నోటి ద్వారాను, మీ జీవితముద్వారాను మీరు ఆయనను ఒప్పుకొనిన యెడల పరలోకమందున్న తండ్రి యెదుట ఒక దినమున మిమ్మును ఆయన ఒప్పుకొందునని ఆయన చేసిన వాగ్దానమును జ్ఞాపకముంచుకొనుడి. "మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నా తండ్రియెదుట నేనును వానిని ఒప్పుకొందును. మనుష్యుల యెదుట ఎవడు నన్ను ఎరుగననునో వానిని పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును ఎరుగనందును" (మత్తయి 10:32-33; కొలస్సి 3:17). నిజమైన క్రైస్తవునిగ గుర్తింపును కలిగియుండునట్టి నిరీక్షణకంటె యెక్కువైన దేమున్నది !

— o —

## ప్రస్తుత కాలంలో అపొస్తలు లున్నారా ?

క్రొత్త నిబంధనలో అపొస్తలుడు అన్న పదాన్ని మొదటిసారిగా

మన ప్రభువు తన పన్నెండుమంది శిష్యులకు వాడినారు. పన్నెండు మంది కంటె ఎక్కువమంది శిష్యులున్నారు. వారిలో పన్నెండుమందినే ఎన్నిక చేసుకొని ప్రభువు వారిని అపొస్తలులు అని పిలిచారు (లూకా 6 : 13).

అపొస్తలుడు అన్న పదం గ్రీకు భాషలో అపొస్తలాస్ అనగా పంపబడినవాడు, వర్తమానికుడు అని అర్థం. అపొస్టెల్లో (క్రియా వాచకం) అనగా పంపుట. నామవాచకం అపొస్టలాస్ అనగా వర్త మానికుడు. క్రొత్తనిబంధనలో ఈ పదాలు సర్వసామాన్యంగా వాడ బడినవి. అపొస్టలాస్ అన్న పదాన్ని ప్రతి స్థలంలో అపొస్తలుడు అని తర్జుమా చేసినట్లయిన క్రొత్త నిబంధనలో పన్నెండుమంది కంటె ఎక్కువమంది అపొస్తలు లుంటారు ఆలాగయితే ప్రభువు పన్నెండు మందినే అపొస్తలులు అని పేరు పెట్టడం అర్థరహితమే అవుతుంది. కనుక అపొస్తలుడు అన్న పదం సాంకేతికపరంగాను సిద్ధాంతరీత్యాను ప్రత్యేకంగా ప్రభువు ఎన్నిక చేసికొన్న పన్నెండుమంది శిష్యులకే వర్తిస్తుంది.

ప్రస్తుత కాలంలో అపొస్తలులు వున్నారా లేరా? అని మనం ప్రశ్నించుకుంటే దానికి జవాబును చూచుకొనేటప్పుడు సాంకేతిక లేక సిద్ధాంతపరమైన భావానికిన్ని, సామాన్య భావానికిన్ని తారతమ్యాన్ని గుర్తించాలి.

ప్రభువు తాను ఎన్నిక చేసుకొన్న వారిని అపొస్తలులు అని ప్రత్యేకంగా పిలిచినట్లు మనం లూకా 6 : 13 లో చూడగలం. ఆ రీతిగా క్రొత్త నిబంధన కాలములో యితరులను వేరెవ్వరిని ఆలాగు నియుక్తులనుచేసినట్లు లేక అభిషేకించినట్లు మనకు గోచరించదు. అంతే కాక వారి అపొస్తలత్వాన్ని యితరులకు బదిలీచేయడం లేక వారి స్థానంలో మరొకని నియమించడం జరిగినట్లు క్రొత్తనిబంధనలో దాఖ

లాలు లేవు. దీనిని బట్టి అపొస్తలులు అన్న హోదా ఆ పన్నెండు మందితోనే అంతమైందని మనం గమనించవచ్చును.

## అపొస్తలుల అర్హతలు

అపొస్తలుల అర్హతలు గూర్చి క్రొత్తనిబంధన ఏమని వివరించు చున్నదో కొంత పరిశీలన చేయుదము.

1. అపొస్తలుని ప్రభువే ఎన్నిక చేసుకొని నియుక్తినిగా చేసాడు (మత్త 10 : 2; లూకా 6 : 13; మత్తయి 28 : 18-30; యోహాను 15:16).
2. అతడు ప్రభువు పునరుత్థానానికి సాక్షి (అపొ. కార్య. 1:22).
3. అతడు దైవిక సత్యముల ప్రత్యక్షతను పొందినవాడు(ఎఫెసీ 3:5).
4. సువార్త ప్రకటనద్వారా సంఘ స్థాపనకు బాధ్యుడైనవాడు (ఎఫె 2 : 20).
5. అతని పరిచర్య అద్భుతములు సూచక క్రియలచేతను స్థిరపరచ బడి యుండవలెను (2 కొరింధి 12:12).

యూదా యిస్కరియోతు బదులు మత్తీయాను ఎన్నుకొన్న విషయం, అన్యజనులకు అపొస్తలుడుగా ఉన్న పౌలుకు ఉన్న అర్హత, హక్కు బైబిలు విద్యార్థికి విధితమే !

## అపొస్తలుడైన పౌలు

అపొస్తలత్వానికి చెందినంత వరకు పౌలును సమ యంలో ప్రభువే ఎంపిక చేసాడు. అకాలంలో పుట్టినట్లు తనను అపొస్తలులలో ఒకనిగా ఆయన ఎన్నిక చేసుకొన్నాడు (1 కొరింధి 9 : 1; 15 : 9). మనుష్యుల మూలముగా గాని, ఏ మనుష్యుని వలన నైనను కాక, యేసుక్రీస్తు వలనను ఆయనను మృతులలోనుండి లేపిన తండ్రియైన దేవుని వలనను-అపొస్తలుడుగా నియమింపబడిన పౌలను

నేనును (గలతీ 1 : 1)...మిక్కిలి శ్రేష్ఠమైన ఈ అపొస్తలులకంటే నేను ఏ విషయములోను తక్కువవాడను కాను" (2 కొరింథీ 12:11). పౌలు అన్యులకు అపొస్తలుడు (2 తిమోతి 1 : 11); ఈ క్రింది విషయాలు పౌలు అపొస్తలత్వమును ధృవీకరిస్తున్నవి.

1. పన్నెండు మంది అపొస్తలుల వలననే పునరుత్థానుడైన క్రీస్తును అతడు చూచాడు (అ.కార్య. 1:22; 1 కొరింథీ 15:8).
2. అన్యజనులకు అపొస్తలుడుగా ప్రభువే అతనిని నియమించెను (అ.కార్య. 9:6-15).
3. అపొస్తలు లందరికంటెను ఉన్నతమైన రీతిగా క్రీస్తునుగూర్చిన మర్మాన్ని పొందడానికి ఎన్నికైనాడు (ఎఫెసీ 3:1-6).
4. పాలస్తీను వెలుపల క్రొత్త నిబంధన సంఘము లన్నిటి స్థాపనలో అతడు సాధన మయ్యాడు (రోమా 16:4).
5. పౌలు పరిచర్యవల్లనే క్రొత్త నిబంధనలో సంగం భాగం పైగానే మనకు లభ్యమయ్యింది.
6. అపొస్తలత్వానికి సూచనలు పౌలు పరిచర్యలో ప్రత్యక్ష మయ్యాయి (2 కొరిం 12:12).

## అపొస్తలులని పిలువబడ్డ ఇతరులు

పన్నెండు మంది అపొస్తలులేగాక యితరులు కూడ క్రొత్త నిబంధనలో అపొస్తలులుగా పిలువబడ్డారనే ఒక వాదన ఉంది. బర్నబా అపొస్తలుడని పిలువబడ్డాడు (అ.కార్య. 14 : 4-14). అంతియొకయ సంఘము పౌలుతో అతడిని పంపినప్పుడు ఉమ్మడిగా అపొస్తలులు అన్నారు (అ.కార్య. 13 : 2, 3). ఈ రెండు సందర్భాలలో అపొస్తలులు అన్న పదాన్ని సామాన్యమైన రీతిగా వర్తమానికులు లేక ఆధునిక పదజాలం మిషనరీలు అని తర్జుమా చేయవచ్చును కానీ సాంకేతి

కంగా అపొస్తలులు అని అనజాలము. ఆ యిద్దరిలో పౌలు ఒక్కడే అపొస్తలుడు. బర్నబా మాత్రం కాదు. తర్వాత రోమా 16 : 7 లో అంద్రోనికు యూనియల ప్రస్తావన. వీరిద్దరు "అపొస్తలులలో ప్రసిద్ధి కెక్కినవారని" పౌలు చెప్పినట్లుంది. ఈ భాగంలో కూడ 1 కొరింథి 8:23 లో వలెనే వర్తమానికులు అని అనువాదం చేయడమే సబబుగా వుంటుంది.

వాస్తవానికి ఆ రోజుల్లో ప్రతి సంఘములోను సంఘ వర్తమానాలను యితర సంఘాలకు చేరవేసే వర్తమానికుడు లేక వర్తమానికులు ఉండేవారు. అంద్రోనికు యూనియ ఏ సంఘానికి చెందినవారో మనకు తెలియదు. అయితే ఆనాటి సంఘ వర్తమానికులలోవారు ప్రసిద్ధి కెక్కినవారు. గలతి 1:19లో ప్రభువు సోదరుడైన యాకోబునుగూర్చి ప్రస్తావించారు. ఈ సందర్భంలో కూడ అపొస్తలత్వం మొదటి పన్నెండుమందిని అధిగమించినట్లు చూస్తున్నాం. కానీ యితడు అల్ఫయి లేక క్లోఫా కుమారుడైన చిన్నయాకోబు. అతడు పన్నెండుమందిలో ఒకడు (మత్తయి 10:3). అతణ్ణి ప్రభువు సోదరుడు అన్నారు. ప్రభువు తల్లి మరియు యాకోబు తల్లి సోదరీలు. ప్రభువు పినతల్లి కుమారుడన్న మాట (యోహాను 19:25, మార్కు 15:40). అటులనే సిల్వాను (1 థెస్స 1:1, 2:6). ఇతడే సీల, పౌలుతో కలిసి పరిచర్య చేసినవాడు. తిమోతి, తీతు, అపొల్లో మొదలగు వారంతా వర్తమానికులే గాని అపొస్తలులుగా నియుక్తులు కాలేరు.

## దొంగ అపొస్తలులు

క్రొత్త నిబంధనలోని ప్రతి భాగాన్ని నిష్పాక్షికంగా తరచి చూచి ఈనాడు అపొస్తలులు-నూతన అపొస్తలులమని చెప్పుకునే వారంతా ప్రకటన 2:2లో వ్రాయబడినట్లుగా-"అపొస్తలులు కాకయే తాము అపొస్తలులమని చెప్పుకొను అబద్ధికులని" తీర్మానించు

చున్నాము. "ఏలయనగా అట్టివారు క్రీస్తుయొక్క (పన్నెండుమంది) అపొస్తలుల" వేషము ధరించుకొను (నటించు) వారై యుండి దొంగ అపొస్తలులును మోసగాండ్రగు పనివారునై యున్నారు....వారి క్రియలచొప్పున వారి కంతము కలుగును (II కొరింథి 11:13-15).

ఎఫెసీ 4:11 లో "అపొస్తలులు" అన్న వరం మొదటిది. అతి ప్రాముఖ్యమైనదిగా ప్రభువు సంఘమున కిచ్చినట్లు పౌలు ప్రస్తావించాడు. దానితోపాటు ప్రవక్తలు సువార్తికులు కాపరులు ఉపదేశకులున్నారు. కొందరు అపొస్తలులు ప్రవక్తలుగా కూడ యున్నారు. పెంతెకోస్తు దినాన ప్రారంభమైన సంఘములో నాటినుండి ఈ రెండు వరాలు ఒకదానిలో ఒకటి సమకాలికంగా వచ్చాయి. అపొస్తలులు ప్రవక్తలు పరిశుద్ధాత్మ వలన ఆత్మావేశముతో నూతన నిబంధన లేఖనములు మనకందించారు. క్రొత్త నిబంధనలో చిట్టచివరి పుస్తకం అపొస్తలుడైన యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథం. యోహాను ప్రకటన వ్రాసి ప్రభువునందు నిద్రించడంతో క్రొత్త నిబంధన లేఖనములు పూర్తి అయ్యాయి. అటుతర్వాత లేఖనములు వ్రాయబడలేదు. ఎందుకనగా అపొస్తలు లందరూ హతసాక్షులయ్యారు. కనుక ఈనాడు అపొస్తలులు లేరు. ఎవరైనా నేను యేసుక్రీస్తు అపొస్తలుడను అని చెప్పుకొంటే అది సాహసోపేతమే అవుతుంది. అలా చెప్పుకోవడం కృత్రిమము అని పైన పేర్కొన్న ప్రమాణాలతో పరిశీలించి నిరూపించవచ్చును.

—యస్.జె. మేడిది, కొణితివాడ.

—o—

## విశ్వాసమనగా....

## ( Faith is... )

క్రైస్తవునికి దేవునితో గల సమస్త సంబంధములకు విశ్వాసము ఆధారమై యున్నది. క్రైస్తవునికున్న నిరీక్షణ యంతటికిని విశ్వాసము

పునాదివంటిది రక్షింపబడువానిని రక్షకునితో కలుపునట్టిది విశ్వాసము. అయితే విశ్వాసము అను అంశమును అపార్థము చేసికొనుచున్నారు. విశ్వాసముయొక్క అర్థమును గూర్చియు, దానిని కార్యాచరణలో నుంచుటను గూర్చియు తెలిసికొనుటకు మనము బైబిలునుండి సహాయమును వెదకుదము. అట్లు చేయకముందు విశ్వాసము ఏమై యుండ లేదో తెలిసికొనుట మనకు సహాయకరముగా యుండునని నా యభిప్రాయము.

## మూఢనమ్మకము కాదు

విశ్వాసము గ్రుడ్డిది, అనాలోచితమైనది కాదు. అనాలోచితముగాను, గ్రుడ్డితనముగాను అనేకులు అనుసరించు మతములు కలవు. అట్టివి మూఢనమ్మకములపై ఆధారపడి యున్నవి. అయితే లేఖనములు విశ్వాసమునుగూర్చి చెప్పు సంగతి దానికి వేరుగ యున్నది : "కాగా వినుటవలన విశ్వాసము కలుగును, వినుట క్రీస్తునుగూర్చిన మాటవలన కలుగును" అని బైబిలు బోధించుచున్నది (రోమా 10:17). దేవుని నుండి వచ్చిన సాక్ష్యముపై విశ్వాసము ఆధారపడి యున్నది. మనము యేసునందు నమ్మునట్లు భక్తుడైన యోహాను తన సువార్తను వ్రాసెను (యోహాను 20:30, 31). ఒక బోధకుడు లేఖనముల ప్రకారము బోధించుచున్నాడో లేదో వినుచున్నవారు లేఖనములను పరిశోధించి తెలిసికొనవలెనని దేవుడు కోరుచున్నాడు (అపొ. కా. 17 : 11). అనాలోచిత మూఢత్వమునకు వ్యతిరేకమైనది విశ్వాసము.

విశ్వాసము చిత్తవిభ్రమ సంబంధమైనది (Emotionalism) కాదు. ఆరాధనలో గంతులు వేయుట, కేకలు వేయుట, బొబ్బలు పెట్టుచు చప్పట్లు కొట్టుట అనునవి చిత్తవిభ్రమ సంబంధమైనవి. అవి విశ్వాస సంబంధమైనవి కావు. బైబిలు విశ్వాసము ఎల్లప్పుడు వాస్త

వేములపైనను, వాటి జ్ఞానముపైనను ఆధారపడియున్నది. వివేకశిష్టమైన (rational) మనస్సును, భావనాప్రేరిత హృదయమును అది ఆకర్షించును. అందుకే "నేను నమ్మిన వానిని ఎరుగుదును" అని అపో. పౌలు చెప్పగలిగెను (2 తిమో 1 : 12). మరల గలతీయులకు వ్రాయుచు అతడు మీరు "ధర్మశాస్త్ర సంబంధ క్రియలవలన ఆత్మను పొందితిరా లేక విశ్వాసముతో వినుటవలన పొందితిరా?" యని అడిగెను (గలతీ 3 : 2). విశ్వాసము ఎల్లప్పుడు సాక్ష్యముపై ఆధారపడియున్నది.

## బుద్ధిహీనత కాదు

విశ్వాసము బుద్ధిహీనత కాదు. ఈమధ్య కొందరు బోధకులు తమకున్న విశ్వాసమును నిరూపించుటకుగాను పాములను పట్టుకొనుట విషమును మ్రింగుట చేసి చనిపోయినట్లు వార్తాపత్రికలలో చదివియుంటిమి. బైబిలులో విశ్వాసము ఎన్నడు ఈరీతిగ చిత్రీకరింపబడ లేదు. సరిగదా విశ్వాసులు ఆరోగ్యకరమైన బుద్ధి, ఆత్మనిగ్రహము కలిగినవారని బైబిలు బోధించుచున్నది. యేసు దేవుని కుమారుడని నిరూపించుకొనుటకు గాను దేవాలయశిఖరమునుండి అపవాది ఆయనను దుముకుమని ప్రోత్సహించినను దానికి ఆయన లోబడలేదు (మత్తయి 4:5-7).

నేను దేనినైనను సంపూర్ణముగ అర్థము చేసుకొంటేనే గాని దానిని నమ్మను అనునట్టిది విశ్వాసము కాదు. లేఖనములలో సమస్తమును మనము గ్రహించుకొనగలమని దేవుడు చెప్పలేదుగాని మనము ఆయన మాటను విశ్వసించవలెను. మనము వెలిచూపును బట్టి కాక విశ్వాసమును బట్టి నడుచుకొనవలెనని ఆయన కోరుచున్నాడు (1 కొరి 5:7). దేవుడు యేమైనను చెప్పినయెడల విశ్వాసము దానిని గ్రహించినను గ్రహించకపోయినను దానిని నమ్మును.

విశ్వాసము ఏమైయుండలేదో ఇంతవరకు మనము చూచాము. ఇప్పుడు విశ్వాసమనగా యేమిటో పరిశీలింతము.

## సాక్ష్యమును నమ్మును

దేవుడు తన వాక్యమునందిచ్చిన సాక్ష్యమును నమ్ముట విశ్వాసము. "కాగా వినుటవలన విశ్వాసము కలుగును, వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును" నీవు దేవుని వాక్యమును ఎంతవరకు చదివి గ్రహించుకొనగలవో అంతవరకు నీ విశ్వాసముండు నని ఈ వాక్యమువలన మనము గ్రహించుకొనగలము.

సమస్త విషయములోను దేవుని, ఆయన కుమారుని నమ్ముటయే విశ్వాసము. "అబ్రాహాము పిలువబడినప్పుడు విశ్వాసమునుబట్టి ఆ పిలుపునకు లోబడి, తాను స్వాస్థ్యముగా పొందనైయున్న ప్రదేశమునకు బయలు వెళ్ళెను. మరియు ఎక్కడికి వెళ్ళవలెనో అది ఎరుగక బయలు వెళ్ళెను" (హెబ్రీ 11 : 8). మరణమునకైనను దేవుని యందు సంపూర్ణ నమ్మిక కలిగియుండుట విశ్వాసము.

దేవుని వాగ్దానములను లేక హెచ్చరికలను విశ్వసించి వాటి ప్రకారము చేయుట విశ్వాసము. శారా గొడ్రాలై 90 సంవత్సరముల వృద్ధురాలైనను తానొక కుమారుని కందునని విశ్వసించెను. ఆమె ఇస్సాకును కనెను (హెబ్రీ 11 : 11). అంతకు ముందెన్నడు వర్షము భూమిపై కురియకపోయినను, భూలోకమునంతటిని జలప్రళయము ద్వారా నాశనము చేసెదనని దేవుడు నోవహుతో చెప్పగా అతడు దానిని విశ్వసించి ఒక ఓడను తయారుచేసుకొని తన కుటుంబమును రక్షించుకొనెను (హెబ్రీ 11:7).

## చెప్పిన దానిని చేయును

దేవుడు చేయుమని చెప్పిన దానిని ఆయన చెప్పినట్లే చేయుట విశ్వాసము. ప్రేమ ద్వారా పనిచేయు విశ్వాసమును దేవుడు కోరు

చున్నాడు (గలతీ 5:6). "విశ్వాసమును బట్టి హేబెలు కయీనుకంటె శ్రేష్టమైన బలి దేవునికి అర్పించెను...అతడు ఆ విశ్వాసమునుబట్టి నీతిమంతుడని సాక్ష్యము పొందెను" (హెబ్రీ 11:4). దేవుని వాక్యము వినుటవలన విశ్వాసము కలుగును గనుక జంతుబలిని అర్పించుమని దేవుడు చెప్పిన దానిని హేబెలు వినెను. కయీనయితే దేవుడు కోరినట్లు గాక తన యిష్టప్రకారము దేవునికి అర్పణలను తెచ్చెను. అతడు తిరస్కరించబడెను. ఎందువలన? అతడు విశ్వాసమును బట్టి నడుచుకొననందు వలన. ఆరాధనలో గాని, పరిచర్యలోగాని, రక్షణ మార్గములోగాని విశ్వాసము దేవుని మాటచొప్పున నడుచుకొనును.

ఎన్ని అపాయములు సంభవించినను దేవుని చిత్తమును చేయుట విశ్వాసము. "అబ్రాహాము శోధింపబడి విశ్వాసమును బట్టి ఇస్సాకును బలిగా అర్పించెను" (హెబ్రీ11:7). తనకు లేక లేక వృద్ధాప్యములో జన్మించిన ఇస్సాకును దేవునికి బలిగా అర్పించుట అబ్రాహాముకు ఎంత అయిష్టమైన సంగతో మనము ఊహించ లేము. అయినను దేవుడాజ్ఞాపించిన దానిని అబ్రాహాము చేసెను. దేవుని ఆజ్ఞలన్నియును మనము అర్థము చేసికొనలేకపోవచ్చును. అయినను దేవుడాజ్ఞాపించుచున్నాడు కనుక విశ్వాసమునుబట్టి వాటికి లోబడుట మంచిది.

"విశ్వాసము నిరీక్షింపబడువాటి యొక్క నిజస్వరూపమును, అదృశ్యమైనవి యున్నవనుటకు రుజువునై యున్నది" (హెబ్రీ 11:1). మనము పరలోకమును చూడకపోయినను విశ్వాసమువలన అది నిజమని మనము నమ్మగలము. మనము చూడలేకపోవుచున్న అనేక ఇట్టి సంగతుల యథార్థతను విశ్వాసము వలన మనము గ్రహించుకొనవచ్చును. అవన్నియు ఉన్నవని దేవుడు చెప్పినందున విశ్వాసము వాటి యథార్థతను అంగీకరించును.

రక్షింపబడుటకు విశ్వాసము దేవునిపై ఆధారపడును గాని స్వనీతిపై కాదు. "మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడి యున్నారు; ఇది మీ వలన కలిగినదికాదు. దేవుని వరమే" (ఎఫెసీ 2 : 8, 9).

## విధేయత చూపును

రక్షింపబడుటకు క్రీస్తు ప్రభువనియు, రక్షకుడనియు విశ్వాసము అంగీకరించును. "యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలోనుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల నీవు రక్షింపబడుదువు" (రోమా 10:9). రక్షించు విశ్వాసము విధేయత చూపించు విశ్వాసమైనది. క్రియలు లేని విశ్వాసము మృతమైనది (యాకోబు 2:26). దేవుని ఆజ్ఞలన్నిటికిని వినయముతో విధేయత చూపించు విశ్వాసమే రక్షించు విశ్వాసము.

విశ్వాసము అభివృద్ధిజెందునట్టిది. అబ్రాహామునకున్నట్టి విశ్వాసము నీకు లేనందున నీవు నిరుత్సాహపడనవుసరము లేదు. దేవుని వాక్యమును నీ దైనిక ఆత్మీయాహారముగా అంగీకరించి దానిని దిన దినము ధ్యానించిన యెడల నీవు విశ్వాసములో దృఢముగ పెరుగ గలవు. విశ్వాసము పాపమునుండి, శోధనల నుండి నిన్ను కాపాడును. అందుకే పౌలు మీరు "విశ్వాసమను డాలు పట్టుకొనుడి; దానితో మీరు దుష్టుని అగ్నిబాణము లన్నిటిని ఆర్పుటకు శక్తిమంతులవుదురు" అని క్రైస్తవులను హెచ్చరించుచున్నాడు (ఎఫెసీ 6:16).

క్రీస్తే మన విశ్వాసమునకు కర్తయు, దానిని కొనసాగించువాడై యున్నాడు (హెబ్రీ 12 : 2). పాపివైన నీవు రక్షింపబడవలెనంటే యేసుక్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించుము. నీ పాపముల విషయమై మారుమనస్సు పొందుము. క్రీస్తునందున్న నీ విశ్వాసమును మనుష్యుల యెదుట ఒప్పుకొనుచు పాపక్షమాపణ నిమిత్తము

బాప్తిస్మము పొందుము. అప్పుడు నీవును నీ విశ్వాసమువలన దేవుని కుమారుడవు కాగలవు (గలతీ 3:26). —జాషువా గూటం.

---

## విశ్వాస సంబంధమైన మంచి పోరాటము పోరాడుము
## ( Fight the Good Fight of Faith )

ఈ అంశములోని మాటలు క్రైస్తవులకు వర్తించును. ఒకడు తన ఆత్మను రక్షించుకొనగోరితే అతడు విశ్వాససంబంధమైన మంచి పోరాటము పోరాడవలెను. క్రైస్తవునియొక్క ఈ ప్రాముఖ్యమైన కర్తవ్యమును గూర్చి వివరంగా తెలుసుకొందము.

### సాతానుతో పోరాటము

క్రైస్తవుడు సాతానుతోను అతని సంబంధులతోను పోరాడాలి. "మనము పోరాడునది శరీరులతో కాదు. గాని ప్రధానులతోను, అధికారులతోను, ప్రస్తుత అంధకారసంబంధులగు లోకనాధులతోను, ఆకాశమండల మందున్న దురాత్మల సమూహముతోను పోరాడుచున్నాము" (ఎఫెసీ 6:12) "నిబ్బరమైన బుద్ధిగలవారై మెలకువగా ఉండుడి; మీ విరోధియైన అపవాది (సాతాను) గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునాయని వెదకుచు తిరుగుచున్నాడు" (1 పేతు 5:8). సాతాను మనలను శోధించి పాపములో పడవేయవలెనని అవకాశం కొరకు అనుక్షణం కనిపెట్టుకొని ఉంటాడు. మనలను వెంటాడుచు వేధించి, సత్యమార్గము నుండి తొలగించుటకు అనేక ప్రయత్నాలు చేస్తాడు. సాధ్యమైనంత ఎక్కువ ప్రజలను తనతోటి నరకపాత్రులను చేయాలని వాని ముఖ్యోద్దేశము. అందుచేత వాడు దేవునియందు భయభక్తులుగల వారిని ఎక్కువగా శోధించును. అట్టి వారికి శ్రమలు కలుగజేసి విశ్వాసము నుండి తొలగించుటకు ప్రయాసపడును. భక్తుడైన యోబును అలా శోధించాడు.

## ఈ లోకముతో పోరాటము

"ఈలోక స్నేహము దేవునితో వైరమని మీరెరుగరా? కాబట్టి యెవడు ఈ లోకముతో స్నేహము చేయగోరునో వాడు దేవునికి శత్రువగును" (యాకోబు 4:4). "ఈ లోకమునైనను ఈ లోకములో ఉన్నవాటినైనను ప్రేమింపకుడి. ఎవడైనను లోకమును ప్రేమించిన యెడల తండ్రి ప్రేమ వానిలో నుండదు. లోకములో ఉన్నదంతయు, అనగా శరీరాశయు నేత్రాశయు జీవపు డంబమును తండ్రివలన పుట్టినవి కావు; అవి లోకసంబంధమైనవే" (1 యోహాను 2 : 15, 16). ఈ లోకము అశాశ్వత మనియు, ఈ లోకమును ప్రేమించ కూడదనియు అనేకమైన హెచ్చరికలు బైబిలు నందు వ్రాయబడి యున్నను నేడు చాలామంది ఈ లోకంలో ఆస్థి సంపాదన కొరకు నిర్విరామముగా కృషి చేయుచున్నారు. గడ్డిపువ్వు వంటి భూనివాసం కొరకు అంతులేని ఆశతో, స్థిరచరాస్థుల కొరకు పడేపాట్లు ఇంతంత కాదు. దినమంతా ఈ ఆలోచనలతో నిమగ్నమై యుంటారు. అశాశ్వత జీవితం కొరకు గృహాలు భవనాలు నిర్మించుట కొరకు ప్రతి ఒక్కరు ఎంతో ఆశపడుతారు. ప్రయాసపడుతారు. అయితే పరలోకమందున్న శాశ్వత గృహం కొరకు ఎందరు ఆలోచిస్తున్నారు? ఎందరు ప్రయాస పడుచున్నారు? దైవ వాక్యం యీలాగున్నది: "మన మీ లోకములోనికి ఏమియు తేలేదు. దీనిలో నుండి ఏమియు తీసికొని పోలేము. కాగా అన్నవస్త్రములు గలవారమైయుండి వాటితో తృప్తిపొంది యుందము. ధనవంతులగుటకు అపేక్షించువారు శోధనలోను, ఉరిలోను, అవివేక యుక్తములును హానికరములునైన అనేక దురాశలలోను పడుదురు. అట్టివి మనుష్యులను నష్టములోను నాశనములోను ముంచివేయును. ఎందుకనగా ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము. కొందరు దానిని ఆశించి విశ్వాసమునుండి తొలగి

పోయి నానా బాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి" (1 తిమోతి 6 : 7-10). మానవునికి అన్నము వస్త్రములు కనీస అవసరములని బైబిలు చెబుతుంటే గృహము కూడా కనీస అవసరమని ఈ లోకం చెబుతుంది. దేవుడు గృహాన్ని అనుగ్రహిస్తే సంతోషించాలి. లేకుంటే అన్నవస్త్రములతో తృప్తి పొంది యుండాలి. దేవునికి కృతజ్ఞులై యుండాలి. జ్ఞానియైన సొలొమోను: "ఐశ్వర్యము పొంద ప్రయాస పడకుము. అట్టి ఆశ నీకు కలిగినయెడల దానిని విడిచిపెట్టుము" అని అన్నాడు (సామెతలు 23 : 4). శరీరముతోను, లోకముతోను పోరాడవలసిన మనము దేవుడిచ్చిన వాటితో తృప్తి పొందడం నేర్చుకోవాలి. ఈ లోకమును దాని ఆశయు గతించిపోవును. అవి మన ఆత్మలను రక్షింపలేవు.

## శరీరముతో పోరాడాలి

శరీరము బలహీనమైనది. త్వరగా పాపములోనికి నడుపబడుతుంది. "ఆత్మ సిద్ధమే గాని శరీరము బలహీనము" అని యేసుక్రీస్తు అన్నారు (మార్కు 14 : 38). అపొస్తలుడైన పౌలు నా యందు, అనగా నా శరీరమందు మంచిది ఏదియు నివసింపదని నేనెరుగుదును. మేలైనది చేయవలెనను కోరిక నాకు కలుగుచున్నది గాని, దానిని చేయుట నాకు కలుగుటలేదు అని చెప్పాడు (రోమా 7:18). పాపము వైపునకు సులభముగా ఆకర్షింపబడే శరీరముతో క్రైస్తవుడు పోరాడవలెను. శరీరాశలను నెరవేర్చకుండ ఉండాలి. ఎందుకనగా "శరీరానుసారమైన మనస్సు మరణము" (రోమా 8:6). కనుక మనము ఆత్మస్వభావము గలవారమై యుండాలి. మన శరీరము పాపం విషయమై మృతమైనది (రోమా 8 : 9, 10). "తన శరీరమునకు బట్టి విత్తువాడు తన శరీరము నుండి క్షయమను పంట కోయును" (గలతీ 6:8). శరీరానుసారంగా ప్రవర్తించువాడు తన ఆత్మను రక్షించుకొనలేడు.

## మంచి పోరాటము

మనము పోరాడునది ఈ లోకసంబంధమైన రాజ్యము కొరకు, అధికారము కొరకు కాదు. పరలోక రాజ్యము పొందుటకు పోరాడుచున్నాము (యోహాను 18 : 36). మనము నిత్యరక్షణకొరకు పోరాడాలి, నిష్ఫలమైన అంధకార క్రియలకు వ్యతిరేకంగా పోరాడాలి (ఎఫెసీ 5 : 11). పాపమునకు వ్యతిరేకంగా మంచి పోరాటము కొనసాగించాలి. ఈ పోరాటము వలన దేవుడు మహిమ పర్చబడుతాడు (మత్తయి 5 : 16). సాతాను మనయొద్దనుండి పారిపోవును (యాకోబు 1 : 7).

## విశ్వాససంబంధమైన పోరాటము

మనము విశ్వాస సంబంధమైన పోరాటము పోరాడాలి. ఎందుకనగా మనము "వెలిచూపుల వలన కాక విశ్వాసము వలననే నడచుకొనుచున్నాము" (2 కొరింథీ 5:6). దేవుని కుమారుని యందలి విశ్వాసము వలన జీవించుచున్నాము (గలతీ 2:20). దేవుని వాక్యము చదువుట వలన, వినుట వలన మనకు విశ్వాసము కలుగుచున్నది (రోమా 10 : 17). దేవుని వాక్యము మనలను విశ్వాసములో బలపర్చును, ధైర్యపర్చును. దేవుని యందలి విశ్వాసముతో ధైర్యముగా నడిచిన అనేక గొప్ప వ్యక్తులను గూర్చి హెబ్రీ పత్రిక 11వ అధ్యాయములో చదువగలము.

విశ్వాసము వలన మనకు విజయము కలుగును. దేవుని మూలముగా పుట్టిన వారందరును లోకమును జయించుదురు; లోకమును జయించిన విజయము మన విశ్వాసమే (1 యోహాను 5:4). విశ్వాసము దేవుని ఆజ్ఞకును (మార్కు 16 : 16), విధేయత చూపుటకును, పాపక్షమాపణ పొందుటకును (అపొ. కా. 2 : 38) సహాయపడును. దేవునికి అంగీకారమగు సత్య ఆరాధన చేయుటకును, ఆయనకు ప్రీతి

కరమైన సేవ చేయుటకును విశ్వాసము తోడ్పడును. మన నిత్య నివాసము పరలోకమందున్నది. కనుక విశ్వాస సంబంధమైన మంచి పోరాటము పోరాడాలి.

—వి.జె. బెన్‌సన్, హైదరాబాదు.

—o—

## కొందరు క్రీస్తు సంఘమును వ్యతిరేకించుటకు గల కారణ మేమి?

1. సత్యవాక్యమును సరిగా విభజింపకపోవుట వలన (2 తిమోతి 2 : 15).
2. దేవుని వాక్యమును తమ స్వకీయ నాశనము నిమిత్తము అపార్థము చేయుట వలన (II పేతురు 3 : 16).
3. దేవుని వాక్యమును కలిపి చెరుపుటవలన (II కొరింథి 2 : 17).
4. మానవకల్పిత సిద్ధాంతములు బోధించుటవలన (మార్కు 7:7).
5. దేవుని శక్తినిగాని, లేఖనములను గాని ఎరుగక పొరబడుటవలన (మార్కు 12 : 24).
6. క్రీస్తుకుగాక తమ కడుపుకే దాసులైనవారు ఇచ్చకపు మాటలను చెప్పుటవలన (రోమా 16 : 18).
7. సత్యమునకు చెవి నీయక కల్పనాకథలను బోధించుటవలన (II తిమో 4 : 3, 4).
8. దేవుని వాక్యమునకు కలుపుట తీసివేయుటవలన (ప్రకటన 22 : 18, 19).
9. భిన్నమైన సువార్త ప్రకటించుట వలన (గలతీ 1 : 6-7).
10. అబద్ధ బోధకులు ప్రభువును విసర్జించి నాశనకరమగు భిన్నాభిప్రాయములను రహస్యముగా బోధించుటవలన (2 పేతురు 2 : 1, 3).

11. అనేకులైన అబద్ధ ప్రవక్తలు లోకములో ఉన్నందున (1 యోహాను 4 : 1).
12. క్రూరమైన తోడేళ్ళనుబోలిన అబద్ధ బోధకులు వంకరమాటలు పలుకుటవలన (అపొ. కా. 20 : 29-31).
13. సాతాను వెలుగుదూత వేషములో వచ్చుటవలన (II కొరింథి 11 : 13-15).
14. దేవుని నీతిని ఎరుగక తమ స్వనీతిని స్థాపింపబూనుకొనుట వలన (రోమా 10 : 3).
15. విశ్వాసమునుండి పతనమగుటవలన (హెబ్రీ 10 : 20-29).
16. నాయకులు ఘనతను ఆశించుటవలన (అపొ. కా. 20:28-31).
17. లోకసంబంధమైన దురాశల వలన (2 పేతురు 2:18-22).

—పి. చంద్రశేఖర్, కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్.

—o—

## మానవుడు దేవునియొద్ద దొంగిలునా?

## (Will a Man Rob God?)

ఇదొక తెలివితక్కువ ప్రశ్నవలె అగుపడును. మానవుడు దేవుని యొద్ద ఎట్లు దొంగిలగలడు? పూర్వము లిఖించబడిన సంగతు లన్నియు మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెనని మనకు చెప్పబడినది (రోమా 15:4). మలాకీ 3:8-10 లో ఇశ్రాయేలీయులు దేవునియొద్ద దొంగిలుచున్నారని చెప్పబడినది. వారు దేవునియొద్ద ఎట్లు దొంగిలిరి? వారు పదియవ భాగమును, ప్రతిష్టితార్పణలను ఇయ్యక దొంగిలిరని ప్రవక్త చెప్పుచున్నాడు.

భారతదేశంలో దేవుని పని నిమిత్తము లక్షలకొలది డాలర్లు పలు సంఘములకు, సహోదరులకు ఇయ్యబడుచున్నవి. ఈ పనిలో రెండు సంగతులు ప్రాముఖ్యమైనవి: ప్రజలకు దేవునిగూర్చి బోధింప

బడాలి. ప్రజలు నిజదేవుని ఆత్మతోను సత్యముతోను ఆరాధించాలి. ఒకడు సువార్త పని విషయమై సహాయము నందుకొని, సంఘపు పనిని జరిగించని యెడల అతడు సంఘముయొద్ద, దేవునియొద్ద దొంగిలిన వాడవుతాడు.

మాకు ఏవిధమైన సపోర్టు లేదని కొందరు నాకు ఉత్తరాలు వ్రాస్తూ యుంటారు. అమెరికా సపోర్టు లేదని వారి ఉద్దేశ్యము. పౌలుకు అమెరికానుండి ఎవరు డబ్బు పంపలేదని మీకు తెలియదా ? అతడు చాల గొప్ప పని చేయుచుండెను. అతని దగ్గర డబ్బు అయి పోయినది. అతడేమిచేసాడు ? అతడు తన చేతులతో కష్టపడి పని చేసాడు. మనకు అన్ని విషయములలో మాదిరి చూపుటకు అతడట్లు చేసాడు (అపొ. కా. 20 : 34-35). మనము పీల్చు గాలి కూడ దేవుని యొక్క బహుమానమే (అపొ.కా. 17:28). ఉబ్బసముతో బాధపడు చున్న వానిని నేను చూచినప్పుడు, సులువుగా గాలి పీల్చుకొనే అవ కాశ మిచ్చినందుకు నేను దేవుని స్తుతింతును. చక్కెర వ్యాధి (Diabetes) తో బాధపడుచున్న వానిని నేను చూచినప్పుడు, నేను సులువుగా అన్ని ఆహార పదార్థములను తినగలుగుచున్నందున దేవుని స్తుతింతును.

మతశాఖలు ఆయా శాఖల ద్వారా దేవుని సేవించుటకు ప్రయ త్నించు చున్నారు గనుక వారు దేవునియొద్ద దొంగిలుచున్నారు. మనము ఆయనను సంఘముద్వారా సేవించాలి (మత్తయి 16 : 18; ఎఫెసీ 3 : 20-21). డినామినేషన్లన్నియు కలసి క్రీస్తు సంఘ మవుతా యని వారంటారు. అయితే ఒకే ఒక్క శరీరమున్నది (ఎఫెసీ 4 : 4; 1:22-23). మనము మానవకల్పిత నామముల ద్వారా దేవుని దొంగి లించరాదని ఖండితముగా ఆజ్ఞాపింపబడి యున్నాము (కొలస్సె 3:17). క్రీస్తు నామముద్వారానే మనము రక్షింపబడగలము (అపొ. కా.

4:12). క్రీస్తు నామము ద్వారాను, క్రీస్తు సంఘము ద్వారాను పని చేయకపోవుట వలన మతశాఖలు దేవునియొద్ద దొంగిలుచున్నారు.

దేవుడు మన కనుగ్రహించిన ఆర్థిక వనరులద్వారా ఆయన పనిని జరిగించకపోవుట వలన మనమును దేవునియొద్ద దొంగిలుచున్న వార మగుదుము. ఎవరైనా సువార్త విషయం నీకు ఆర్థికంగా సహాయము చేయుచున్న యెడల నీవా పనిని జరిగించకపోతే నీవును దేవుని యొద్ద దొంగిలువాడవే. —జె.సి. బెయిలీ.

— o —

## యేసు నామము

## ( The Name of Jesus )

యేసు నామమును మనము వినినప్పుడు అపొ. పేతురు అపొ. కా. 3:6 లో చెప్పిన మాటలు మనకు జ్ఞాపకము వస్తాయి. దేవాలయపు ద్వారమునొద్ద కూర్చొని భిక్షమడుగుకొనుచున్న ఒక కుంటి వానిని పేతురు బాగుచేసాడు. ఆ మరునాడు పేతురు యోహానులు చెరసాలలో వేయబడ్డారు. వారు ప్రధాన యాజకుని యొద్దకును, పెద్దల యొద్దకును తేబడినప్పుడు, "మీరు ఏ బలముచేత, ఏ నామమునుబట్టి దీనిని చేసితిరని అడుగగా, పేతురు పరిశుద్ధాత్మతో నిండినవాడై మీరు సిలువవేసినట్టియు, మృతులలోనుండి దేవుడు లేపినట్టియు నజరేయుడైన యేసు నామముననే వాడు స్వస్థత పొంది మీ యెదుట నిలుచుచున్నాడని చెప్పెను" (అపొ.కా. 4:5-10).

ఈ లేఖన భాగాన్ని చదువునప్పుడు యేసు నామము ఎంత ఆశ్చర్యకరమైనదో, ఎంత అందమైనదో, ఎంత శక్తివంతమైనదో యని ఊహించకుండ ఉండలేకపోవుచున్నాను కొందరు యేసు నామమును, లేక ఆయన అధికారమును ఎందుకు కించపరచుదురో నేను ఊహించ లేకున్నాను. పేరులో ప్రాముఖ్యత యేమీ లేదని కొందరు వాదిస్తారు.

మనము యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవముపొందునట్లును యోహాను తన సువార్తను వ్రాసెను (యోహాను 20:30-31). గనుక యేసు నామము ద్వారానే మనకు జీవము కలుగును. దీనిలో ప్రాముఖ్యత యేమీ లేదని చెప్పే నామము కాదిది. ఆ నామములోనే మారుమనస్సును, పాపక్షమాపణయు ప్రకటింపబడాలని లూకా చెప్పుచున్నాడు (లూకా 24 : 47). యేసు నామమే మనలను నీతిమంతులనుగా తీర్చు నామమని అపొ. పౌలు చెప్పుచున్నాడు (1 కొరింథీ 6:11). మానవజాతికి అంతకంటే ప్రాముఖ్యమైనది యేమున్నది?

యేసు నామము హింసలుపాలయ్యే నామమని కూడ మనము తెలిసికోవాలి. యూదుల పెద్దలు అపొస్తలులను కొట్టి విడుదలచేసే, "ఆ నామము కొరకు అవమానము పొందుటకు పాత్రులని యెంచబడి నందున వారు సంతోషించుచు మహాసభ యెదుటనుండి వెళ్ళిపోయిరి" (అపొ. కా. 5 : 41). "మీరు నా నామము నిమిత్తము అందరిచేత ద్వేషింపబడుదురు" అని ఆయన ముందుగనే వారిని హెచ్చరించెను (మత్తయి 10:22). అంతిప అను సహోదరుడు క్రీస్తు నామమును హత్తుకొని ఆయనను నిరాకరించనందున హతసాక్షి అయినట్లు కూడ మనము చదువగలము. మన విశ్వాసమును బట్టి మనకేమి సంభవించినను, మనము పొందబోయే బహుమానము యెదుట ప్రస్తుత కాలపు శ్రమలు ఎన్నతగినవి కావని అపొ. పౌలు చెప్పుచున్నాడు (రోమా 8 : 18).

మనము కూడుకొంటే యేసు నామముననే కూడుకొనాలి (మత్త. 18 : 20). ఆయన నామమును మనము దూషించరాదు (యాకోబు 2:7). సరిగదా ఆయన నామమును మహిమ పర్చాలి (కొలస్సి 3:17). యేసు నామము అన్ని నామములకంటె పై నామము.

ఆయన నామమును ప్రతి నాలుక ఒప్పుకొనును, ప్రతి మోకాలును వంగును (ఫిలిప్పీ 2 : 9-11).

ఆ నామముననే మనకు రక్షణ కలదని అపొ.కా. 4:12 చెప్పుచున్నది. యేసు నామము ప్రాముఖ్యమైనదే కాకుండా మరి యే నామమున మనము రక్షణ పొందలేము. ఆయన నామమును స్తుతించుట ఎంత మంచిదో! ఆయన నామమును ధరించుట ఎంత ఘనతయో! ఆయన నామమందు భద్రము చేయబడుట ఎంత దీవెనకరమో! ఆయన నామమునకు లోబడకుండా యున్న వారికి కలుగు అవమానము ఎంత ఘోరమో! మనము ఆయన నామమును ప్రచురించి, ఘనపరచడానికి దేవుడు సహాయము చేయును గాక.

—కిమ్ రోవెల్ (IBc).


# Kakinada School of Preaching

NEHEMIAH GOOTAM, Director

Officers Training in Bible for Male Candidates in Various Courses

6 Week Course
1 Year Course
2 Year full time course
Experienced Qualified Faculty

No Tuition Fees
Free Food and Lodge
20 Years of age or above
Studied Intermediate or above

APPLICATIONS NOW BEING ACCEPTED

For Admissions and Information Write

KAKINADA SCHOOL OF PREACHING
P.O. Box 57
KAKINADA - 533 001, A.P.
Phone 74882

(టైటిల్ 2వ పేజీ తరువాయి)

యెరూషలేమునుండి పంపబడిరి. కారణమేమంటే చేతులుంచబడుట ద్వారా పరిశుద్ధాత్మను పొంది సూచకక్రియలు చేయువారు మరొకరికి ఈ శక్తిని యివ్వలేకపోయిరి. చేతులుంచుటద్వారా పరిశుద్ధాత్మను పొందినవారు బ్రతికి యున్నంతకాలమే సూచకక్రియలు జరిగెను అని చక్కగా వివరించిరి.

ఐతియోపీయుని బాప్తిస్మము, చెరసాల అధిపతి, లూదియ, ఎఫెసులో శిష్యులు పొందిన వాక్యానుసారమైన బాప్తిస్మమును గూర్చి వివరంగా బోధించగా అనేకులు బాప్తిస్మము పొందిరి. జాన్ ఫోర్డు గారితో వారి సతీమణి నాన్సీ ఫోర్డు (Nancy Ford) గారు వారి వెంట వచ్చిరి. సోదరి ఏన్ స్కాట్ (Ann Scott) గారు స్త్రీలకు బైబిలు తరగతులు మధ్యాహ్న సమయంలో జరిగించిరి. స్వదేశీ సోదరులు జి. జాన్సన్‌గారు, N. టైటస్‌గారు, జి. షడ్రక్ గారు, పాల్ గూటంగారు, ఇ.కె.వి. ప్రసాదరావుగారు, I. ఇశ్రాయేలుగారు, R.Ch. సద్గుణరావుగారు, వి. చిన్నయ్యగారు, పి. ప్రకాశంగారు, S.V. రావ్‌గారు, కె. సత్యనారాయణగారు తదితరులు చక్కని వర్తమానమును అందించిరి. బొంబాయి, హైదరాబాదు, నిజామాబాద్, గోవా యింకా యితర ముఖ్యపట్టణముల నుండి వచ్చిన సోదరులు ప్రార్థనను నడిపించిరి. వేలమందికి ఆహారము వడ్డించుచు అవసరమైన చక్కని ఏర్పాట్లు జరిగించిరి. స్కూల్ విద్యార్థులు, బైబిలు అధ్యాపకులు శ్రమించి ఎంతో మంచి ఏర్పాట్లు చేసిరి. 18వ తేదీన సోదరులు జాన్ ఫోర్డుగారు బిల్డింగు ఫౌండేషన్ స్టోన్ (శంఖుస్థాపన) చేసిరి. సెమినార్ నిమిత్తము క్రొత్త పాటల పుస్తకములు స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌వారు ముద్రించిరి. వారు క్రొత్త పాటలు పాడి అందరికీ నేర్పించిరి. సోదరులు నెహెమ్యా గూటంగారు మరియు సోదరులు జాషువా గూటంగారు సమయోచితంగాను సమర్థవంతముగాను కార్యక్రమములు నడిపించిరి. అనారోగ్య కారణంగా సోదరులు షెర్రి కోతమ్ గారు సెమినార్‌కు హాజరుకాలేకపోయిరి.

సెమినార్ జరిగిన అన్ని రోజులలోను పలువురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. వారి సంఖ్య మొత్తం 190 ఆయెను. 20వ తేది ఉదయం కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌లో బైబిలు శిక్షణ పొందిన వారికి గ్రాడ్యుయేషన్ జరిగెను. మొత్తం 16 మందికి ఆరోజు నేన్సీ ఫోర్డుగారిద్వారా డిప్లొమాలు అందజేయబడెను. జాన్ ఫోర్డుగారు విద్యార్థుల నుద్దేశించి వాక్యమునుండి మంచి హెచ్చరికల నిచ్చిరి. ఉత్తమ క్రమశిక్షణను ఉత్తమ శ్రేణిని, ఉత్తమ హాజరును పొందిన వారికి ప్రత్యేక బహుమతులు ఇయ్యబడెను. జనవరి 21వ తేదీ ఉదయకాలపు సమావేశానంతరము సెమినార్ ముగిసెను. వచ్చినవారందరు సంతోష హృదయాలతో తమతమ గ్రామములకు, పట్టణములకు తిరిగి వెళ్ళిరి.

ఫిబ్రవరి నెల ప్రీచర్స్ వర్క్ షాప్ పలివెల గ్రామంలో 22వ తేదీ మంగళవారం సోదరులు వి. జె. కృపాలనీగారి ఆధ్వర్యంలో జరుగును.

---

Regd. No. H/KD-45/KD. H.O.

From
SATYAWAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No.

To